క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

దొర్నిపాడు: మండలంలోని బుర్రారెడ్డిపల్లె ఇందిరానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై సుబ్బరాయుడు, నాగేంద్రప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ప్రస్తుతం మనం తీసుకునే ఆహారం విషతుల్యం అవుతుందని తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. ఇళ్ల వద్ద ఖాళీ ప్రదేశాలు, మిద్దెలపై మొక్కలను ఎలా పెంచుకోవాలో శిక్షణ ఇచ్చారు.

అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలి

గోస్పాడు: ఉపాధ్యాయులు చాలా కాలంగా ఎదురుచూస్తున్న అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరావు కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ రాకముందే బదిలీల ప్రక్రియ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లు మంజూరు ఆర్డర్ సీఎస్ఈ నుంచి మాత్రమే ఇవ్వాలన్నారు. హెల్త్ కార్డులను ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఉన్న అన్ని హాస్పిటళ్లలో అంగీకరించాలన్నారు. ఉపాధ్యాయులు సురేష్ శర్మ, శ్రీనివాసులు, రాజశేఖరరెడ్డి ఉన్నారు.

ప్రశాంత ఎన్నికలకు చర్యలు



శిరివెళ్లలో కవాతు నిర్వహిస్తున్న బలగాలు

శిరివెళ్ల: త్వరలో జరగనున్న ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటుందని సీఐ చంద్రబాబు పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రం శిరివెళ్ల, అత్యంత సమస్యాత్మక గ్రామం గోవిందపల్లెలో సీఐ ఆధ్వర్యంలో కేంద్ర పోలీస్ బలగాలు కవాతు నిర్వహించాయి. ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ ఏజెంట్ కస్టమర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని సాయిబాబానగర్ నుంచి శ్రీనివాస సెంటర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, అసోసియేషన్ కార్యదర్శి రూబెన్, గౌరవాధ్యక్షుడు బాబాఫకృద్దీన్ మాట్లాడుతూ డిపాజిట్ డబ్బులు ఇవ్వాలని, చనిపోయిన కుటుంబాలకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. ప్రసాద్, సోమన్న, ధనుంజయుడు, ప్రతాప్, భూమిని శ్రీనివాసులు, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

రామకృష్ణ డిగ్రీ కళాశాలకు అవార్డు

నంద్యాల(న్యూటౌన్): తెలుగు రాష్ట్రాల నుంచి ఎంఓయూ తీసుకున్న కళాశాలల ఈకో సిస్టమ్ ఇన్ ఎమర్జెన్సీ విభాగంలో రామకృష్ణ విద్యాసంస్థలకు మొదటి అవార్డును ఫౌండర్ చీఫ్ ఏపీసీ–ఎస్‌కేయూ సీఈఓ శివకుమార్, వీసీ హుసేన్‌రెడ్డి ఈనెల 10వ తేదీన అందజేశారని డాక్టర్ రామకృష్ణారెడ్డి సోమవారం తెలిపారు.

అభాగ్యులకు అండగా ప్రభుత్వం

నంద్యాల(సిటీ): అభాగ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. సోమవారం ఎంఎస్ నగర్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో మెప్మా, శైలజా సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వైస్ చైర్మన్ పాంషావలితో కలిసి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో నైట్ షెల్టర్ ఉందన్నారు. మెప్మా సీఎంఎం విజయభాస్కర్‌రెడ్డి, రాణి ఉన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

రుద్రవరం: గ్రామ సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ రామచంద్ర సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, సంక్షేమ పథకాల ఈ–కేవైసీ పెండింగ్ లేకుండా చూడాలన్నారు. వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది కల్పలత ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

ఆళ్లగడ్డ: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరు వ్యక్తులకు చెరో నెల రోజుల పాటు న్యాయమూర్తి జైలుశిక్ష విధించారని సీఐ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. రుద్రవరం మండలం మందలూరుకు చెందిన సురేష్, పట్టణానికి చెందిన చాణిక్య శర్మ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడగా ఎస్ఐలు వెంకటరెడ్డి, నగీన కేసునమోదు చేశారు. వారిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా ఒక్కొక్కరికి నెలరోజుల పాటు జైలుశిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించారని వివరించారు.

ఎన్నికల బాండ్ల వివరాలు వెల్లడించాలి

నంద్యాల(న్యూటౌన్): ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బీఐ వెల్లడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో సోమవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట ధర్నా చేశారు. నాయకులు రాజశేఖర్, గోపాల్, వెంకటలింగం, గౌస్, రామరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి రంజాన్ మాసం ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): ముస్లింల పవిత్ర రంజాన్ మాసం మంగళవారం నుంచి ప్రారంభం కానుందని ముస్లిం పెద్దలు తెలిపారు. సోమవారం సాయంత్రం నెలవంక కనిపించడంతో ముస్లింలు ఉపవాసానికి సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. నెలవంకను చూసిన వెంటనే ప్రత్యేక తారావి ప్రార్థనలు, నమాజ్‌లను ప్రారంభించారు. ఉదయం సహేరి 4గంటలకు పూర్తిచేసుకొని సాయంత్రం ఉపవాస దీక్ష ముగిస్తారు.



గ్రామ సమీపంలో నిర్మితమవుతున్న గోదాము



ఆర్.కొత్తపల్లెలో నూతనంగా వేసిన సీసీ రోడ్డు



ఆర్.కొత్తపల్లెకు వేసిన తారు రోడ్డు



ఆర్.నాగులవరంలో ప్రారంభానికి సిద్ధంగా గ్రామ సచివాలయ భవనం

ప్రగతి పథంలో ఆర్.నాగులవరం

- సమాంతరంగా సంక్షేమం, అభివృద్ధి
- మారిన బడులు, రోడ్ల రూపు రేఖలు
- జయహో జగనన్న అంటున్న ప్రజలు



రుద్రవరం: పల్లెలు పట్టుకొమ్మలు అంటారు.. అయినా టీడీపీ ప్రభుత్వం వాటి అభివృద్ధిని విస్మరించింది. దీంతో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారాయి. కనీస సౌకర్యాలకు నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా మాటలతో మభ్యపెట్టారు. తమ సమస్యలు పరిష్కరించండి మహాప్రభో అంటూ ఆయా గ్రామాల నాయకులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఎన్నికల సమయంలో మాత్రం వారికి ప్రజలు గుర్తుకొచ్చేవారు. విసిగి వేశారిన జనం వారిని తరమికొట్టారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారి అవస్థలను పరిష్కరించింది. దీంతో పట్టుకొమ్ములు ప్రస్తుతం ప్రగతి పథంలో పరుగులు తీస్తున్నాయి.



బడిలో బెంచీలపై విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

మారిన రుపురేఖలు..

మండలంలోని ఆర్.నాగులవరం పంచాయతీ కూడా గతంలో అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుతం ఆ పంచాయతీతో పాటు మజరా గ్రామమైన ఆర్.కొత్తపల్లె అభివృద్ధి పనులతో కళకళలాడుతున్నాయి. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు నిధులతో రూపురేఖలు మార్చారు. అలాగే అంతర్గత సీసీరోడ్లు, డ్రైనేజీలు వేశారు. ఆయా గ్రామాల లింకు, పొలాలదారులకు మరమ్మతులు చేయించారు. రైతుల ప్రయోజనార్థం గోదాము నిర్మించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు కొన్ని పూర్తవగా, మరిన్ని ముమ్మరంగా సాగుతున్నాయి. ఆర్.నాగులవరం గ్రామ సచివాలయం పరిధిలోని ఆర్.కొత్తపల్లె, టీ.లింగందిన్నె గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వం ప్రత్యక్ష, పరోక్షంగా సంక్షేమం కోసం 6,335 మందికి రూ.25.19 కోట్లు లబ్ధి చేకూర్చింది. దీంతో ప్రజలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

నాగులవరం, ఆర్.కొత్తపల్లె, టి.లింగందిన్నె గ్రామాల్లో అభివృద్ధికి వెచ్చించిన నిధులు..

అభివృద్ధి పనులు	నిధులు
ఏపీఆర్ఆర్‌పీ	రూ.152 లక్షలు
గ్రామ సచివాలయం,ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లు	రూ.82.90లక్షలు
నాడు–నేడు కింద మూడు పాఠశాలల అభివృద్ధి	రూ.66 లక్షలు
గోదాము నిర్మాణం	రూ.72 లక్షలు
జీజీఎంపీ	రూ.20 లక్షలు
ఉపాధి హామీ	రూ.16.40లక్షలు
మండల నిధులు	రూ.8 లక్షలు
పంచాయతీ నిధులు	రూ.5 లక్షలు

శిలాఫలకంతో సరిపెట్టారు..

కొండమాయపల్లె నుంచి ఆర్.కొత్తూరు మీదుగా ఆర్.కొత్తపల్లె వరకు తారు రోడ్డు వేసేందుకు ఏపీఆర్ఆర్‌పీ కింద టీడీపీ ప్రభుత్వ హయాంలో సాధారణ ఎన్నికలకు ముందు రూ.1.52 కోట్లు మంజూరయ్యాయి. వాటికి సంబంధించి పనులు ప్రారంభిస్తూ నాటి మంత్రి భూమా అఖిలప్రియ కొండమాయపల్లె వద్ద శిలాఫలకం ఆవిష్కరించారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రోడ్డు పనులు పూర్తి చేసి ప్రజలకు రాకపోకలను సులభతరం చేసింది.

పాఠశాలను పూర్తిగా మార్చేశారు



నాడు–నేడుతో పాఠశాల రూపురేఖలను మార్చివేశారు. విద్యార్థులు గతంలో నేల మీద కూర్చొని విద్యనభ్యసించేవారు. ప్రస్తుతం అందమైన బెంచీల మీద కూర్చొని చదువుకుంటున్నారు. రంగుల రంగల బొమ్మలతో ప్రహరీ, నాణ్యమైన గోరుముద్ద అందుతోంది.అదనపు తరగతి నిర్మాణానికి సంబంధించి పనులు పూర్తి చేసేందుకు రూ.1.60 లక్షలు మంజూరయ్యాయి.

– ప్రవీణ్,హెచ్‌ఎం,ఆర్.నాగులవరం

రోడ్ల సమస్య తీరింది



టీడీపీ ప్రభుత్వ హయాంలో మా గ్రామాన్ని పట్టించుకున్న వారే లేరు. ఉన్నత స్థాయి పదవులు ఉన్నప్పటికీ అభివృద్ధిపై దృష్టి సారించలేదు. గ్రామం నుంచి బయటకు రావాలంటే సరైన దారి లేక ఇబ్బందులు పడేవాళ్లం. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామంలో కొత్తగా సీసీ రోడ్లు వేశారు. చందలూరు,ఆర్.నాగులవరం వైపు రాక పోకలు సాగించేందుకు మట్టి రోడ్లు వేశారు. రుద్రవరం వైపు వెళ్లేందుకు తారురోడ్డు వేశారు. మంచి పనులు చేసిన జగనన్న వైపే నిలుస్తాం.

– వెంకటసుబ్బారెడ్డి, రైతు, ఆర్.కొత్తపల్లె

ప్రభుత్వ సహకారంతోనే అభివృద్ధి



రాష్ట్ర ప్రభుత్వం, గంగుల కుటుంబం సహకారంతో సర్పంచుగా సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రజల సమస్యలను పరిష్కరించాం. గ్రామాల్లో పార్టీలకతీతంగా అంతర్గత సీసీ రోడ్లు వేశాం. పొలాల రోడ్లు వేయించాం. పారిశుద్ధ్యం మెరుగు, తాగునీటి సరఫరా వంటివి సమస్య లేకుండా పరిష్కరించాం. కొన్ని పనులు ఇంకా కొనసాగుతున్నాయి. వాటిని కూడా త్వరలో పూర్తి చేయిస్తాం.

– గంధం సావిత్రమ్మ, ఆర్.నాగులవరం సర్పంచ్

ఆర్యవైశ్యులకు అండగా ప్రభుత్వం



మాట్లాడుతున్న కుప్పం ప్రసాద్

నంద్యాల(వ్యవసాయం): ఆర్యవైశ్యుల అభ్యున్నతికి జగనన్న ప్రభుత్వం అండగా నిలిచిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక రిటైల్ జనరల్ మర్చెంట్ అసోసియేషన్ కార్యాలయంలో ఆర్యవైశ్యుల సమావేశానికి కుప్పం ప్రసాద్, మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రసాద్ మాట్లాడుతూ జగనన్న ప్రవేశపెట్టిన అన్ని పథకాలు ఆర్యవైశ్యులకు వర్తించాయన్నారు. అమరజీవి పొట్టిశ్రీరాములు జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా ప్రకటించారన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. చంద్రబాబునాయుడు హయాంలో ఆర్యవైశ్యులకు ఎటువంటి హోదాలు లేవని, నాడు అభద్రత భావంలో ఉండేవారని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్వేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ నాయకులను గెలిపించాలని కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు అడ్డగాళ్ల మల్లికార్జున, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు భవనాశి నాగమహేష్, నెరవాటి సత్యనారాయణ, బైసాని రమేష్, బింగుమళ్ల శ్యాం, పువ్వాడి భాస్కర్, గెలివి శేఖర్ పాల్గొన్నారు.

నంద్యాలకు తిరుగుపయనమైన పెళ్లిపెద్దలు



నంద్యాలకు వెళుతున్న పార్వతీ, బ్రహ్మనందీశ్వర స్వామి వార్లు

మహానంది: మహానందీశ్వరుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా పెళ్లి పెద్దలుగా వచ్చిన శ్రీ పార్వతీ సమేత శ్రీ బ్రహ్మనందీశ్వరస్వామి వార్లు ఉత్సవాలు పూర్తయిన నేపథ్యంలో సోమవారం తిరిగి నంద్యాలకు బయలుదేరి వెళ్లారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, రుత్వికుల బృందం ఆధ్వర్యంలో స్వామి,అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. స్థానిక రుద్రగుండం కోనేరులో త్రిశూల స్నానం అనంతరం ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలకంరించారు. అనంతరం ఊరేగింపుగా నంద్యాలకు తరలివెళ్లారు.

సమాజంలో మహిళలకు సముచిత స్థానం



రాగహాసిని అభినందిస్తున్న డీఆర్‌ఓ పద్మజ

నంద్యాల(అర్బన్): సమాజంలో మహిళలకు సముచిత స్థానం ఉందని, మహిళలను గౌరవించినప్పుడే సమాజం, దేశం గౌరవించబడుతుందని డీఆర్‌ఓ పద్మజ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నంద్యాల జిల్లా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక ఆర్‌ఏఆర్ఎస్ సెంటినరీ హాల్‌లో వేడుకలు నిర్వహించారు. చిన్నారి రాగహాసిని, పలువురు చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, ఐసీడీఎస్ పీడీ నిర్మల, డీడీ చింతామణి, ఏపీఎస్పీడీసీ డైరెక్టర్ శశికళారెడ్డి, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ రాణి, కార్యదర్శి మాధవి, నాగమణి పాల్గొన్నారు.

మధుమణి సేవలు అభినందనీయం



డాక్టర్ మధుసూదనరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): నంద్యాలకు చెందని ప్రముఖ చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు డాక్టర్ చిత్తలూరి మధుసూదన్‌రావు దంపతుల సేవలు అభినందనీయమని మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా పేర్కొన్నారు. డాక్టర్ మధుసూదనరావు జాతీయ చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుల సంఘం నుంచి జాతీయ జీవన సాఫల్య పురస్కారం అందుకున్న సందర్భంగా నంద్యాల ఐఎంఏ, లయన్స్‌క్లబ్, రోటరీ, దివ్యాంగుల సంక్షేమ సంఘం, ఆర్యవైశ్య సంఘం, క్రికెట్ అసోసియేషన్, నవనిర్మాణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఆంధ్ర యూనివర్సిటీ మాజీ వీసీ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, దస్తగిరిరెడ్డి, వర్ధంశెట్టి రాజారాం, డాక్టర్ రవికృష్ణ, రామచంద్రారావు, జయమ్మ, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు



అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్‌డీఓ

ఉయ్యాలవాడ: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో 85 సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఇంటి వద్దనే ఓటు హక్కు కల్పించనున్నట్లు నంద్యాల ఆర్‌డీఓ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని సమస్యాత్మకమైన ఇంజేడు, ఉయ్యాలవాడలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన వసతులు కల్పించినట్లు చెప్పారు. తహసీల్దార్ వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ తులసీకృష్ణ వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు ఉన్నారు.

వేలంలో పెరిగిన ఆదాయం

శిరివెళ్ల: యర్రగుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ మార్కెట్ల బహిరంగ వేలాలు సర్పంచు అయ్యలూరి సుభహాన్ అధ్యక్షతన సోమవారం జరిగాయి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన వేలంలో పంచాయతీకి ఆదాయం పెరిగింది. గతేడాది రూ.12.64 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది రూ. 15.99 లక్షలు సమకూరింది. వారం సంత రూ.13,1000 , దిన మార్కెట్‌ను రూ.1.71లక్షలకు, కబేలా రూ.1.27 లక్షలకు హెచ్చపాటదారులు దక్కించుకున్నా. ఈఓఆర్డీ నాగేంద్ర పర్యవేక్షణలో పాటలు జరగగా ఉప సర్పంచు సత్తార్ ప్రతాపరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు గాజ కృష్ణారెడ్డి, ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే.. మహదేవపురం వారం సంత మార్కెట్‌కు బహిరంగ వేలంను సోమవారం సర్పంచు పెద్ది రమణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ పాటలో పంచాయతీకి ఆదాయం తగ్గింది. గతేడాది రూ.7.02 లక్షలకు పోగా.. నేడు రూ. 5.50 లక్షలకు పచ్చర్లకు చెందిన శేఖర్ కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ భట్టు ఉన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం





ఉయ్యాలవాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి, ఆళ్లగడ్డలో మాట్లాడుతున్న గంగుల ప్రభాకర్ రెడ్డి

ఆళ్లగడ్డ: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. నాలుగో విడత వైఎస్సార్ చేయూత వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రూరల్ పరిధిలో 2,044 మంది, అర్బన్ పరిధిలో 1,914 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ. 7,42,12,500 వైఎస్సార్ చేయూత మెగా చెక్కును అందజేశారు. విజయా డెయిరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి, డైరెక్టర్ గంగుల విజయసింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్‌రసూల్, కమిషనర్ రమేష్‌బాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఉయ్యాలవాడ : అక్క చెల్లెమ్మలకు ఆర్థిక సావలంబన కోసమే రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక గోల్డెన్ ఫంక్షన్ హాలులో వైఎస్సార్ చేయూత పథకం నాల్గవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో మూడు విడతల్లో 5,473 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.10,26,18,750 వారి ఖాతాల్లో జమ చేసిందన్నారు. అంతకుముందు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలిసి పాలాభిషేకం చేసి చెక్కు అందజేశారు. జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మదేవి, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గజ్జెల కృష్ణారెడ్డి, సర్పంచ్ మేకల ఓబులేసు, రైతు సలహా మండలి చైర్మన్ పోచా రాధాకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, తరిగోపుల ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్‌లు దేశం సోమశేఖర్‌రెడ్డి, పల్లె గురుప్రసాద్‌రెడ్డి, రామమద్దిలేటి రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, పల్లె మహేశ్వరరెడ్డి, నాయకులు కపురం శ్రీనివాసరెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, కూలూరు రామకృష్ణారెడ్డి, కసాని ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీలు బాలిరెడ్డి, గగ్గెర వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ రఘురాం పాల్గొన్నారు.



హాజరైన వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల

దొర్నిపాడు: అక్కా,చెల్లెమ్మలకు ఇచ్చిన మాట ప్రకారం ఐదేళ్లలో నాలుగు విడతల వైఎస్సార్ చేయూత ద్వారా రూ.75వేలు జమ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో నాల్గో విడత వైఎస్సార్ చేయూత చెక్కులను మహిళలకు అందజేశారు. 1,334 మంది లబ్ధిదారులకు రూ.10.05కోట్లను నాల్గో విడతలో పంపిణీ చేశామన్నారు. మండలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. ఐదేళ్లపాటు నియోజకవర్గం ప్రశాంతంగా పాలన సాగించిన ఘనత తమకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బత్తుల నాగేశ్వరరావు, మండల వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ శ్రీపతిప్రసాద్, విజయా డెయిరీ డైరెక్టర్ విజయసింహారెడ్డి, నాయకులు శివరామిరెడ్డి, మనోహర్‌రెడ్డి, కూలూరు నరసింహారెడ్డి, శంకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శాంతయ్య, చిన్నమద్దిలేటి, డీలర్ పెద్దన్న, సుమంత్, బత్తుల కృష్ణయ్య, కర్నాటి కృష్ణారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, బాలసుబ్బయ్య, ప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాదం శీను, విజయ్, సర్పంచులు మాధవీలత, శివరామిరెడ్డి, వెంకటేశ్వర్లు,, ఎంపీడీఓ సుబ్బారెడ్డి, ఏపీఎం బాబు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

నంద్యాల(సిటీ): పట్టణంలోని 21వ వార్డు నూనెపల్లెకు చెందిన రాగిపల్లె మల్లీశ్వరి సోమవారం తన నివాసంలో మృతి చెందారు. మృతురాలు వైఎస్సార్ బీమాకు అర్హురాలు కావడంతో నామినీ అయిన భర్త చౌడప్పకు బీమా తక్షణ సాయం కింద రూ.10వేల నగదును వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ అమృతరాజ్, సచివాలయ అడ్మిన్ గురుస్వామి నారాయణ, నాయకులు కంబయ్య, భాస్కర్, దేవి, వలంటీర్లు చెరకు శ్రీదేవి, సాజిదా అందజేశారు.

ముగిసిన మార్కెట్ వేలాలు

రుద్రవరం: స్థానిక మేజర్ పంచాయతీలో సోమవారం సర్పంచ్ బైరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈఓ సుబ్బారావు మార్కెట్ వేలాలు నిర్వహించారు.12 మంది కాంట్రాక్టర్లు డిపాజిట్లు చెల్లించి దిన, వారపు సంత,కబేలా మార్కెట్ల గేటు వసూళ్లకు వేలంలో పోటీ పడ్డారు. ఇందులో పంచాయతీకి రూ.12.81లక్షల ఆదాయం వచ్చిందని, గతేడాది కంటే రూ.1.31లక్షలు అదనంగా సమకూరిందని ఈఓ తెలిపారు. ఎంపీపీ బాలస్వామి,వైఎస్సార్‌సీపీ నాయకుడు బ్రహ్మం పాల్గొన్నారు.

కుందూ మృతులకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: స్థానిక ముత్యాలపాడు బస్టాండు వీధికి చెందిన హుసేన్‌బీ (27), మస్తాన్(26) అక్కా, తమ్ముళ్లు ఆదివారం కుందూ నదిలో మునిగి మృతి చెందిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలకు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి సోమవారం నివాళులర్పించారు. వైఎస్సార్ జిల్లా రాజుపాళెం పోలీసులు పోస్టుమార్టం అనంతరం సోమవారం సాయంత్రం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇదిలా ఉండగా.. హుసేన్‌బీకి నలుగురు సంతానం. మస్తాన్‌కు భార్య, 4 నెలల చిన్నారి ఉన్నారు. మృతి వార్త తెలియడంతో కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. జామియా మసీదు వరకు నిర్వహించిన అంతిమయాత్రలో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ షేక్.బాబులాల్, రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి సి.వెంకటరమణ, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా, యువజన విభాగం అధ్యక్షుడు వి.షరీఫ్, ప్రచార కార్యదర్శి పెయింటర్ షరీఫ్, గేట్ల మాబుసాబ్ పాల్గొన్నారు.

అన్నదాతల అభివృద్ధికి కృషి

ఆళ్లగడ్డ: అన్నదాతల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జలవనరుల శాఖ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని చింతకుంటలో నిర్మాణం పూర్తి చేసుకున్న బహుళ ప్రయోజన సౌకర్య గోదామును సోమవారం ప్రారంభించి రైతులకు అంకితం చేశారు. అనంతరం గ్రామంలో రూ.25 లక్షల ఎంపీ నిధులతో నిర్మించిన శ్మశానం ప్రహరీ ప్రారంభించారు. సొసైటీ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, నాయకులు భూమా కిషోర్‌రెడ్డి, రంగేశ్వర్‌రెడ్డి, రాజారెడ్డి, శివనాగిరెడ్డి, పలచాని మల్లికార్జునరెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మీనరసింహులు, నజీర్‌బాషా ఉన్నారు.

నేడు వర్చ్‌వల్‌గా ప్రారంభం

నంద్యాల(సిటీ): రైల్వే స్టేషన్లలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి పలు ప్రాజెక్టులను దేశ ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభిస్తారని గుంటూరు డివిజన్ ఏడీఎంఈ (అసిస్టెంట్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్) రవీంద్రనాథ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. నంద్యాల రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేయనున్న వన్ నేషన్ వన్ ప్రొడక్ట్ స్టాల్‌ను ఇందులో భాగంగా ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

నంద్యాల(సిటీ): అర్బన్ పరిధిలోని సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక 4వ వార్డు పార్క్ రోడ్డులోని సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలోని సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీలో జాప్యం చేయొద్దని చెప్పారు. అనంతరం వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌తో కలిసి పరిశీలించారు.